రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఎత్తైన ప్రదేశాల్లో కల్లాలు ఏర్పాటు చేసుకోవాలి

■ భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్, మే 15 : జిల్లాలో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా ఎత్తైన ప్రదేశాల్లో కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని దీక్షకుంట, నందిగామ, పంది పంపుల, మహాముత్తారం మండలంలోని మినాజీపేట, రేగులగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు అనువుగా ఉండే ఎగువ ప్రాంత భూమిని గుర్తించాలని కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలను సమకూర్చుకోవాలని వెంకటేశ్వర్లు సూచించారు.

20న కేంద్ర బృందం రాక

■ ఐదు రోజుల పాటు పలు గ్రామాల్లో పర్యటన
■ లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలి
■ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, మే 15 : కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం ఈ నెల 20న భూపాలపల్లి జిల్లాకు రానుందని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. బృందంలోని 27 మంది సభ్యులు ఐదు రోజుల పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేంద్ర బృందం పర్యటనపై పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భూపాలపల్లి మండలం గొర్లవేడు, కాటారం మండలం గంగారం, మహదేవపూర్ మండలం కాళేశ్వరం, రేగొండ మండలం కొడవటంచ, గణపురం మండలం చెల్పూర్ గ్రామ పంచాయతీల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై బృంద సభ్యులు అధ్యయనం చేస్తారని తెలిపారు. ఆయా పంచాయతీల్లో వారు బస చేయాల్సి ఉన్నందున వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని ఎంపీడీవోలకు సూచించారు. ఆయా గ్రామాల్లో నర్సరీలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులను పరిశీలించే అవకాశం ఉందని, అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. అధికారుల బృందం పర్యటన పర్యవేక్షణ నోడల్ అధికారిగా డీపీవో నారాయణరావును నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డాక్టర్ మల్లిచెన్నారెడ్డి సంస్థ ట్రైనింగ్ మేనేజర్ కుమారస్వామి, డీపీవో నారాయణరావు, డీఆర్‌డీవో నరేశ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికకు ఏర్పాట్లు చేయాలి

భూపాలపల్లి రూరల్, మే 15 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్, అదనపు సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ బీఆర్‌కే భవన్ పోలింగ్ నిర్వహణపై వారు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి పాల్గొన్న భవేశ్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 8 వేల మంది పురుషులు, 4,535 మంది మహిళా పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికలకు 20 జంబో బాక్సులు, 1,679 పెద్ద బాక్సులు సిద్ధంగా ఉంచామన్నారు. పోలింగ్ సిబ్బంది నియామక ప్రక్రియ రేపటి వరకు పూర్తి చేసి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీఈవో సామ్యూల్, ఆర్డీవో మంగీలాల్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడికి మెరుగైన చికిత్స అందించాలి

ములుగురూరల్, మే 15 : ఎన్నికల విధుల్లో అస్వస్థతకు గురై హైదరాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్న వెంకటాపూర్ మండలం బూర్గుపేట ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు మధుకుమార్‌కు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భద్రాచలంలో ఎన్నికల విధులకు వెళ్లిన మధుకుమార్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కోమాలోకి వెళ్లాడన్నారు. ప్రస్తుతం కిమ్స్ దవాఖానాలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సతీశ్‌కుమార్, ఏళ్ల మధుసూదన్, ఉపాధ్యాయులు పోరిక మోహన్‌లాల్, సోమ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

ములుగురూరల్ : మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండీ అమ్జద్‌పాషా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవోకు, సివిల్ సప్లై డీఎంకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గన్నపేట, మదనపల్లి, జంగాలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీపీఐ పార్టీ సందర్శించిందన్నారు. అన్ని కేంద్రాల్లో 15రోజుల నుంచి ధాన్యం ఆరబోసిన రైతులు అకాల వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వెనువెంటనే కాంటాలు వేయాలని కోరారు. లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో రైతులు దరినీ సమీకరించి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మండల కార్యదర్శి ముత్యాల రాజు, నాయకులు నారాయణసింగ్, రమేశ్, రైతులు శ్రీనివాస్, వెంకటయ్య, నాగరాజు ఉన్నారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

ములుగురూరల్ : ఇసుక లారీలను నియంత్రించాలని కోరుతూ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కోగిల మహేశ్ బుధవారం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. అధికారుల పర్యవేక్షణ లేనందున లారీ డ్రైవర్లు మద్యం సేవించి ఓవర్‌లోడ్, అధిక వేగంతో వాహనాలు నడుపడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాత్రి 8 నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించే విధానాలు ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అడ్డుకట్ట వేయకపోవడంతో లారీ డ్రైవర్లు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టర్, మైనింగ్ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయాలకు మైక్ సెట్ల బహూకరణ

మైక్ సెట్ అందజేస్తున్న దాత

గణపురం, మే 15: మండలంలోని ధర్మారావుపేటలో గల హనుమాన్, రేణుకా ఎల్లమ్మ దేవాలయాలకు హైదరాబాద్‌లో నివసిస్తున్న గ్రామానికి చెందిన సిద్దూరి సంపత్‌రావు రెండు మైక్ సెట్లను బుధవారం బహూకరించారు. వీటిని శ్రీ ఉమా మహేశ్వర సేవా సమితి అధ్యక్షుడు ఆకుల సుభాష్ ఆధ్వర్యంలో ఆలయాల నిర్వాహకులు నారగాని ఎల్లస్వామి గౌడ్, ఆకుల దామోదర్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బెనికి రాజేందర్, గడ్డం చందర్, ఆకుల మధు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కృష్ణకాలనీ, మే 15 : తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన భూపాలపల్లి మండలం కమలాపురంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు గ్రామానికి చెందిన బుర్ర శంకర్ కుల వృత్తిలో భాగంగా రోజూలాగే కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలుజారి చెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రలోని ప్రధాన ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన శంకర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

గణపురం, మే 15 : మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన మామిడిపెళ్లి ప్రమీల (55) మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త మల్లయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై మచ్చ సాంబమూర్తి కేసు నమోదు చేసి వివరాలు వెల్లడించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రమీల తనను దవాఖానకు తీసుకెళ్లాలని కోరగా డబ్బులు లేక తీసుకపోకపోవడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో ములుగు సామాజిక ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పిడుగుపాటుతో ఆవు, లేగదూడ మృతి

వెంకటాపూర్, మే 15 : మండలంలోని లింగాపూర్ గ్రామ పరిధి గొత్తికోయగూడెంలో మంగళవారం సాయంత్రం పిడుగు పడి ఆవు, లేగదూడ మృతిచెందింది. బాధితుడు మడకం భీమా తెలిపిన వివరాల ప్రకారం.. లింగప్పకుంట వద్ద ఆవులను మేపుతుండగా మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పిడుగుపడి ఆవు, లేగదూడ మృతి చెందిందన్నారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రమేశ్, కారోబార్ రాజేందర్ పంచనామా చేసి, మండల పశువైద్యాధికారి డాక్టర్ నటరాజు, తెలుపగా పోస్టుమార్టం నిర్వహించారు. పశువుల విలువ రూ.లక్ష ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

మంగపేట, మే 15 : ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయడం అమానుషమని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హట్కార్ సమ్మయ్య, పల్లె నాగరాజు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ప్రజాపాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వంలో ఉపాధ్యాయులపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన భత్యం ఇవ్వాలన్నందుకు వారిపై లాఠీచార్జి చేయించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తునికాకు సేకరణ షురూ

■ అడవి బిడ్డలకు వేసవిలో ఉపాధి

ఎల్లకేశ్వరంలో తునికాకులను కట్టలు కడుతున్న ప్రజలు

మహదేవపూర్, మే 14 : గిరిజనులు, గిరిజనేతరులు ప్రకృతి సంపదగా భావించే తునికాకు సేకరణ మండలంలో బుధవారం ప్రారంభమైంది. వేసవిలో ప్రతి యేటా అడవి బిడ్డలు తునికాకు సేకరణతో ఉపాధిపొందుతున్నారు. గతంలో 50 ఆకులు ఉన్న ఒక్కో కట్ట ధర రూ.2.50 కాగా, ప్రస్తుతం రూ. 3కు పెంచారు. మండలంలోని ఎల్‌కేశ్వరం యూనిట్ పరిధిలో 800 స్టాండర్డ్ బ్యాగ్‌లు, సూరారం యూనిట్ పరిధిలో రెండు వేల స్టాండర్డ్ బ్యాగ్‌లు లక్ష్యంగా టెండర్లు పూర్తి కాగా సదరు కాంట్రాక్టర్ కల్లాలను సిద్ధం చేస్తున్నారు. తునికాకు కోసం ప్రజలు ఉదయమే సమీప అటవీ క్షేత్రాలకు వెళ్లి తునికాకు సేకరించి 9 గంటల లోపే ఇండ్లకు చేరుకుంటారు. వాటిని గ్రేడింగ్ చేసి మేలైన వాటిని నిర్ణిత ప్రమాణంలో కట్టలుగా కట్టి కల్లాలకు చేరవేసి కాంట్రాక్టర్‌కు విక్రయిస్తారు. వారం రోజుల్లో లబ్ధిదారులకు వారి అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయని, దీని కోసం ముందుగానే ఆధార్, బ్యాంక్ వివరాలు సేకరించి ఉచితంగా వేజ్ కార్డులను అందజేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో కమల తెలిపారు. అటవీశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రజలకు ఇబ్బంది లేకుండా కల్లాలను నిర్వహిస్తామని వెల్లడించారు. నెల రోజుల పాటు తునికాకు సేకరణతో పల్లె ప్రజలు ఉపాధి పొందుతారు. ప్రభుత్వం సౌకర్యాలు కల్పించి ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే నష్ట పరిహారం చెల్లించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, మే 15 : రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల ఓపీ రిజిస్టర్, శానిటైజేషన్, ఆపరేషన్ థియేటర్ పరిశీలించారు. గతంలో దవాఖానకు మంజూరు చేసిన 5 ఏసీల వినియోగంపై ఆరా తీశారు. ఓపీ కోసం దవాఖానకు వచ్చే రోగులు నిలబడాల్సి వస్తున్నదని, 60 త్రీ సీటర్ చైర్స్ మంజూరు చేయాలని వైద్యాధికారులు కోరగా వెంటనే స్పందించిన ఆయన కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. దవాఖానలో చికిత్స పొందుతున్న రోగుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ చికిత్స కోసం వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. రోగులకు మనోధైర్యాన్ని కల్పించాలని, దవాఖాన అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ నవీన్, తదితరులున్నారు.

18 నుంచి గ్రూప్-1 ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్ట్

భూపాలపల్లి రూరల్, మే 15: గ్రూప్-1 ప్రిలిమ్స్-2024 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్‌లో గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు హన్మకొండ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీల్లో హనుమకొండ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్)-2024 ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌ను ఈ నెల 23, 26, 28, 30, జూన్ 10, 12 తేదీల్లో హైదరాబాద్‌లోని సైదాబాద్ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల అభ్యర్థులు https://studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని గ్రాండ్ టెస్ట్‌కు హాజరుకావచ్చని తెలిపారు. వివరాలకు 040-27077929, 24071178 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గణపురం, మే 15 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నలబాల సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మీ సేవా కేంద్రంలో లేదా www.tsmodelschools.com వెబ్‌సైట్‌లో ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు, బాలికలకు ఉచిత హాస్టల్ సదుపాయం ఉంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

వైద్య కళాశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు

ములుగురూరల్, మే 15 : ములుగు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్న 32ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 డాటా ఎంట్రీ ఆపరేటర్స్, 4 డిసెక్షన్ హాల్ అటెండెంట్, 8 ఆఫీస్ సబార్డినేట్, 4 థియేటర్ అసిస్టెంట్, 4 ల్యాబ్ అటెండెంట్, 2 రికార్డు అసిస్టెంట్ ఉద్యోగాలకు https://mulugu.telangana.gov.in/లో దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకొని 17 నుంచి 22వ తేది వరకు ములుగు ప్రభుత్వ దవాఖానలోని రూమ్ నంబర్ 48 ఫస్ట్ ఫ్లోర్‌లో అందించాలన్నారు. వివరాలకు హెల్ప్ డెస్క్ 7013952246 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, మే 15 : 2024-25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, పీహెచ్‌సీ విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డీ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలో 7 జీపీఏ పైన మార్కులు సాధించిన విద్యార్థులు www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఎన్‌హెచ్ఆర్సీ కార్యాలయం ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య

ములుగురూరల్, మే 15: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) ములుగు జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య బుధవారం ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు పెట్టెం రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు. భద్రయ్య మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎన్‌హెచ్ఆర్సీ పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రజాధనాన్ని కాపాడటమే సంస్థ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ఈసీ సభ్యులు హరికృష్ణ, ఏడుకొండలు, సంజీవ, వేణురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాసాచారి, రాజేందర్, జిల్లా ఎన్నికల కన్వీనర్ కొలిపాక రవి, మండల కమిటీ అధ్యక్షులు మధూకర్, శ్రీను, స్వరాజ్యలక్ష్మి, కవి రాజు, కుమారస్వామి, శివయ్య, పద్మ, గంగయ్య, రమేశ్, కుమారస్వామి, ములుగు పట్టణ ప్రధాన కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించాలి

■ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రకళ

మాట్లాడుతున్న న్యాయమూర్తి సూర్యచంద్రకళ

ములుగు రూరల్, మే 15 : న్యాయ సేవాధికార సంస్థల సూచనల మేరకు జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి జిల్లాలోని పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ అధికారులు సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ ఆదేశించారు. లోక్ అదాలత్ నిర్వహణ కోసం బుధవారం జిల్లా కోర్టులో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేలా అధికారులు సహాయపడాలన్నారు. న్యాయ సలహాలు, సూచనల కోసం న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చన్నారు. సమావేశంలో ఆర్టీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎస్పీ రాములు, పరకాల సబ్ జైల్ సూపరింటెండెంట్ ప్రభాకర్, ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్, సీఐలు బండారి కుమార్, శంకర్, ఎస్సైలు మస్తాన్, అశోక్, డీడబ్ల్యూవో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పెంపు

భూపాలపల్లి రూరల్, మే 15: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు గడువును రూ.వెయ్యి అపరాధ రుసుముతో ఈ నెల 16 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కే దేవరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించని విద్యార్థులు తమ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి చెల్లించవచ్చని సూచించారు.

జాతీయ రహదారిపై మృతుడి బంధువుల ధర్నా

లారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

ఏటూరునాగారం, మే 15 : మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై ఇసుక లారీలు నిలపడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్నారని ఆరోపిస్తూ మంగపేట మండలం కమలాపురం గ్రామస్తులు బుధవారం ధర్నా చేశారు. గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రమేశ్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొట్టడంతో మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు రొయ్యూరు, శంకరాజుపల్లి, కమలాపురం గ్రామాలకు చెందిన ప్రజ లు బుధవారం జాతీయ రహదారి నుంచి ఇసుక క్వారీలకు వెళ్లే మార్గం వద్ద ధర్నా చేశారు. దీంతో లారీలు, ఇతర వాహనాలు నిలిచి ట్రాఫిక్ జాం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణప్రసాద్ అక్కడకు చేరుకుని బాధిత కుటుంబంతో మాట్లాడి సర్ది చెప్పారు. నిబంధనలకు వి రుద్ధంగా లారీలను రోడ్డుపై నిలపకుండా ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు విన్నవించారు. అంతేకాకుండా ఇసుక క్వారీ యజమానులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. రోడ్డుపై నిలిచిన లారీలను క్వారీ సమీపంలోకి పంపించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక క్వారీలను తనిఖీ చేసిన అధికారులు

క్వారీలను తనిఖీ చేస్తున్న అధికారులు

కన్నాయిగూడెం, మే15 : మండలంలోని ఏటూరు గ్రామం వద్ద ఉన్న ఇసుక క్వారీలను రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఐ గణేశ్ మాట్లాడుతూ గోదావరి నదిలో ఉన్న పట్టా భూముల్లో ఇసుకను తీ సేందుకు తవ్వకాలు చేపట్టారనే సమాచారంతో తనిఖీలు చేసినట్లు చెప్పారు. అనుమతులు లేకుండా ఇసుకను మిషన్లతో తవ్వకాలు జరిపేందుకు రోడ్డు పనులు ప్రారంభించినట్లు గుర్తించినట్లు తెలిపారు. అనుమతి పత్రాలు తహసీల్‌లో అందజేసిన తర్వాతే ఇసుక తవ్వకాలు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. కాగా, ఇసుక క్వారీ కాంట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి కావడంతో రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వదిలివేశారని, నామ మాత్రపు తనిఖీలు చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దేవునిగుట్ట కమిటీ ఎన్నిక

ములుగురూరల్, మే15 : మండలంలోని కొత్తూరు దేవునిగుట్ట ఆలయ కమిటీని బుధవారం పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరమనేని కిషన్‌రావు, ఉపాధ్యక్షుడిగా అక్కల సంపత్, కార్యదర్శిగా కంచ చంద్రమోహన్, సహాయ కార్యదర్శిగా బండి రమేశ్, కోశాధికారిగా గట్టి సుదర్శన్, గౌరవ సలహాదారులుగా అప్పని రాంబాబు, సమ్మిరెడ్డి, ఈసం రవి, చమ్మ కుమారస్వామి, కోరె సుమన్, సోమ వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కార్యనిర్వహణ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఐదు సంవత్సరాల వరకు కొనసాగుతుందని గ్రామస్తులు వివరించారు.

ఇసుక లారీలతో కుంగిపోయి ప్రమాదకరంగా మారిన రహదారి

ప్రమాదకరంగా జాతీయ రహదారి

భయాందోళనలో వాహనదారులు

మహదేవపూర్, మే 15 : మండల కేంద్రంలోని అప్పయ్యస్వామి ఆలయ సమీపంలోని 353 జాతీయ రహదారి ఇసుక లారీల కారణంగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్లే ఈ రహదారిపై రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, డీసీఎం వ్యాన్‌లు అదుపు తప్పి బోల్తాకొట్టడంతో ప్రయాణికులు త్రీవ గాయాలపాలవుతున్నారు. ఇటీవల ఇదే రహదారిపై వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. రాత్రి వేళ ఈ రహదారి గుండా వెళ్లే ద్విచక్రవాహనదారులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాన్ని కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న రోడ్డును మరమ్మతు చేయించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

సాయం చేస్తున్న ఏఈవోలు, బంధువులు

మంగపేట, మే15 : మండలంలోని కమలాపురానికి చెందిన బందెల సాంబయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఏఈవోల